సాక్షి రాజన్న సిరిసిల్ల

మంగళవారం ౹ 2 ౹ మే ౹ 2023



కల్యాణం.. కమనీయం

బోయినపల్లి(చొప్పదండి): తడగొండలో సోమవారం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. ధ్వజస్తంభం వద్ద గరుడ ముద్దలు ఎగురవేశారు.



రాణా దివస్‌పై చాటింపు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో ఈనెల 4న నిర్వహించే రాణా దివస్‌పై గ్రామాల్లో డప్పు చాటింపు వేయిస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
31.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వినియోగదారుల ‘సహకారం’తో అభివృద్ధి



మాట్లాడుతున్న సెస్ చైర్మన్ రామారావు

గంభీరావుపేట(సిరిసిల్ల): వినియోగదారుల సహకారంతోనే సెస్ సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుందని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పేర్కొన్నారు. గంభీరావుపేటలోని సెస్ కార్యాలయంలో సోమవారం సెస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులో చెల్లించి సంస్థకు సహకరించాలని కోరారు. మండలంలో 70శాతం విద్యుత్ బిల్లులు వసూలయ్యాయని, వందశాతం వసూలుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వ్యవసాయానికి అక్రమంగా వినియోగించుకుంటున్న కనెక్షన్లను రైతులు క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు, ఏఈ సిద్ధార్థ్, నాయకులు రాజారాం, లింగంయాదవ్, శివయ్య, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

సిరిసిల్ల: జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన మంగళవారం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి సోమవారం తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ఉంటుందని, జిల్లాలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు హాజరవుతారని వివరించారు.

మహిళల సంక్షేమమే ధ్యేయం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కోనరావుపేట(వేములవాడ): రైతు, మహిళల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని 138 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. మరిమడ్లలో రూ.20 లక్షలతో నిర్మించే జీపీ భవనం, రూ.9 కోట్లతో నిర్మించే మరిమడ్ల–మానాల రహదారి, కొండాపూర్‌లో రూ.5 కోట్లతో పెంటివాగుపై నిర్మించే వంతెన, రూ.50 లక్షలతో నిర్మించే కల్వర్టు పనులకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ మల్కపేటలో రూ.700 కోట్లతో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులు మరో రెండు, మూడు నెలల్లో పూర్తవుతాయని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మండలంలోని 27,524 ఎకరాలకు సాగునీరందుతుందని తెలిపారు. పంటలు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం అందించేందుకు సీఎం అంగీకరించినట్లు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎంపీపీ చంద్రయ్య, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, వైస్ చైర్మన్లు అనుపాటి భూంరెడ్డి, కాశవేణి మహేశ్, సెస్ వైస్‌చైర్మన్ తిరుపతి, వైస్‌ఎంపీపీ సుమలత, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సర్పంచుల ఫోరం కన్వీనర్ గోపు పర్శరాములు పాల్గొన్నారు.

కంటివెలుగులో 4,235 మందికి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో కంటివెలుగు–2లో సోమవారం 4,235 మందికి నేత్ర పరీక్షలు చేశారు. జిల్లాలో 65వ రోజు కంటి పరీక్షలను 26 ప్రాంతాల్లో నిర్వహించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో రీడింగ్ కంటి అద్దాలను 452 మందికి అందించారు. పాయింట్ కంటి అద్దాలను 503 మందికి పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,41,589 మందికి కంటివెలుగులో పరీక్షలు నిర్వహించారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్ల అర్బన్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్ధార్థ హైస్కూల్‌లో ఉచిత కబడ్డీ శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. శిబిరానికి విద్యార్థులు హాజరయ్యారు. శిక్షణ శిబిరాన్ని ఆసక్తి గల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డురాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, పట్టణాధ్యక్షుడు బొడ్డు నారాయణ, పిట్టల వెంకటేశ్, రామస్వామి, గీస శ్రీనివాస్, సాయికృష్ణ, పాషా, తదితరులు పాల్గొన్నారు.

కన్నీళ్లే మిగిలాయి

- వారం రోజులుగా కురుస్తున్న వానలు
- వడగండ్లతో నేలరాలిన ధాన్యం
- కొనుగోలు కేంద్రాల్లోకి వరదనీరు
- మొలకెత్తిన ధాన్యం



ఇతను వేములవాడ మండలం మర్రిపల్లికి చెందిన వంగపల్లి తిరుపతి. ఇన్నాళ్లు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలు పోయిన తిరుపతి ఈసారే మొదటిసారి వ్యవసాయం చేశాడు. పెట్టుబడిగా రూ.1.90లక్షల వరకు ఖర్చు పెట్టాడు. మరికొద్ది రోజుల్లోనే పంట చేతికొస్తుందనుకుంటుండగా వడగండ్లు వచ్చి పంట మొత్తం నేలపాలైంది.



మొలకెత్తిన ధాన్యం చూపుతున్న రైతు వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌కు చెందిన వివేక్. తన కున్న మూడెకరాలలో వరిపంట పండించాడు. ఐదు రోజుల క్రితం పంటను కోసి కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చాడు. అప్పటి నుంచి తూకం వేయకపోవడంతో వరుసగా కురుస్తున్న వర్షానికి వడ్లు రంగు మారి, మొలకెత్తాయి. ఇప్పటికైనా కొనుగోలు చేయాలని అధికారులను కోరుతున్నాడు.



నాంపల్లిలో నేలకొరిగిన వరి పంట

సిరిసిల్ల/ముస్తాబాద్(సిరిసిల్ల)/వేములవాడరూరల్/వేములవాడఅర్బన్/బోయినపల్లి(వేములవాడ): జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా వరుసగా కురుస్తున్న వడగండ్లు రైతులకు కన్నీరే మిగిల్చాయి. ఎడతెరిపిలేకుండా వర్షం పడడంతో పొలాల్లో వడ్లు రాలిపోయాయి. ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. గాలి, వానలతో వరి పొలాలు దెబ్బతిన్నాయి. తడిసిన ధాన్యం, రాలిన వరి గింజలను చూసి రైతులు కన్నీరు పెడుతున్నారు.

ఆరునెలల శ్రమఫలం నేలపాలు

యాసంగిలో జిల్లాలోని 50 శాతం మేరకు అంటే 85 వేల ఎకరాల్లో పొలం కోతలు కాగా, మరో 85 వేల ఎకరాల్లో పంట కోయాల్సి ఉంది. వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది.

జిల్లాలో అపార నష్టం

- వేములవాడ రూరల్ మండలంలోని 17 గ్రామాల్లో దాదాపు 10 వేల ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. ఇప్పటికీ చాలా మంది రైతులు పంట కోయలేదు. వరుసగా కురుస్తున్న వడగండ్లతో పంట నేలపాలుకాగా.. కల్లాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. అధికారిక లెక్కల ప్రకారం మండలంలో 2 వేల ఎకరాల వరకే పంట నష్టం జరిగిందని తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు రెండింతలు పంట నష్టం జరిగినట్లు తెలుస్తోంది.
- వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్, నాంపల్లి, వేములవాడ మండలంలోని అన్ని గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. కొనుగోలు కేంద్రాల్లోని వడ్లు తడిసి మొలకెత్తాయి.
- బోయినపల్లి మండలంలోని కొదురుపాక, బోయినపల్లి, తడగొండ, వెంకట్రావుపల్లి, నీలోజిపల్లి గ్రామాల్లో ఈదురుగాలులతో కురిసిన వర్షంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది.
- ముస్తాబాద్ మండలం నామాపూర్, కొండాపూర్, గూడెం, ఆవునూర్, పోతుగల్, ముస్తాబాద్ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ముస్తాబాద్‌లో 34.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ మునీందర్ తెలిపారు. గూడెం, ముస్తాబాద్, పోతుగల్, ఆవునూర్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారి వెంకటేశ్, ఏఈవోలు పరిశీలించారు.

జిల్లాలో వర్షపాతం ఇలా.. (మిల్లీమీటర్లలో)

రుద్రంగి	25.4
చందుర్తి	45.4
వేములవాడరూరల్	20.8
బోయినపల్లి	38.5
వేములవాడ	42.3
సిరిసిల్ల	47.2
కోనరావుపేట	29.1
వీర్నపల్లి	25.3
ఎల్లారెడ్డిపేట	17.1
గంభీరావుపేట	38.6
ముస్తాబాద్	35.5
తంగళ్లపల్లి	22.0
ఇల్లంతకుంట	36.6



బోయినపల్లిలో తడిసిన ధాన్యం

రైతు బాధలు తీర్చేదెవరు?



కల్లాల్లో ధాన్యం పోసుకుని రాత్రి, పగలు కునుకు లేకుండా ఇబ్బంది పడుతున్నం. ప్రభుత్వం సాయం చేస్తుందని చెబుతున్నప్పటికీ ధైర్యం రావడం లేదు. మూడు రోజులుగా కల్లాల కాడనే ఉంటున్నం. మా దగ్గరికొచ్చిన వారు లేరు.
– వజ్రమ్మ, మహిళా రైతు, శాత్రాజుపల్లి

గడ్డి తప్ప వడ్లు లేవు



ఎనిమిది ఎకరాలకు ఆరెకరాలు సాగు చేసిన. ఇంకా కోతలు ప్రారంభించలేదు. వరుసగా వర్షాలు వస్తున్నాయి. వడగండ్ల వానతో పొలంలో ఉన్న పంట మొత్తం మునిగిపోతోంది. గడ్డి తప్ప వడ్లు కనిపిస్త లేవు.
– పెద్దిగారి బుజ్జవ్వ, రైతు, శాత్రాజుపల్లి

నేడు మంత్రి కేటీఆర్ పర్యటన



మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు మంగళవారం సిరిసిల్లలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు మినీస్టేడియంలో పోలీస్ క్రీడాపోటీల ముగింపు కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొంటారు. మహిళల సేఫ్టీ కోసం ఏర్పాటు చేసిన యాప్‌తోపాటు మానసిక ఆరోగ్య సేవల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు.

పాత పద్ధతిలోనే లడ్డూల తయారీ !

- రాజన్న ప్రసాదంలో కలుస్తున్న అల్యూమినియం



గంటెలతో రుబ్బుతుండగా అల్యూమినియం పాత్రపై ఏర్పడిన నల్లటి పదార్థం

వేములవాడ: రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న భక్తులు తప్పకుండా స్వామి వారి లడ్డూ ప్రసాదాలను కొనుగోలు చేసి తీసుకెళ్తారు. అయితే లడ్డూలు తయారు చేసే క్రమంలో వేడి బూందీ, ఇతర వస్తువులను అల్యూమినియం పాత్రల్లో వేసి ఇనుప గంటెలతో కలుపుతుంటారు. ఈక్రమంలో అల్యూమినియం పాత్రపై ఇనుపగంటె చేసే రాపిడికి నల్లటి అపరిశుభ్రమైన పదార్థం లడ్డూలలో కలిసిపోతుంది. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ పాత పద్ధతిలోనే లడ్డూలను తయారు చేస్తుండడమే ఇందుకు ప్రధాన కారణం. తిరుపతిలో మాదిరిగా అధునాతన యంత్రాలను ఏర్పాటు చేస్తే ఈ పరిస్థితి ఉండబోదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఆలయ అధికారులు చొరవ తీసుకుని పాత పద్ధతికి స్వస్తి చెప్పాల్సిన అవసరం ఉంది.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

- చదువు, ఆటపాటలను ఇష్టపడాలి
- సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ
- ‘సాక్షి’ ఆధ్వర్యంలో ఉచిత డ్యాన్స్ శిక్షణ శిబిరం
- ఇంగ్లిష్ యూనియన్ స్కూల్‌లో మూడురోజుల కార్యక్రమం

సిరిసిల్లటౌన్/సిరిసిల్లఅర్బన్: విద్యార్థులు చదువుతోపాటు ఆట, పాటల్లో రాణిస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ఆకాంక్షించారు. సోమవారం ‘సాక్షి’ మీడియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత డ్యాన్స్ శిబిరాన్ని ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి పాతపెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాల వేదికైంది. చైర్‌పర్సన్ కళ మాట్లాడుతూ ‘సాక్షి’ మీడియా విద్యార్థులకు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు కలిగిస్తున్న అవకాశం అభినందనీయమన్నారు. డ్యాన్సులో రాణించాలంటే ఇష్టపడి నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు కళలపై జిజ్ఞాస పెరిగేందుకు ఇలాంటి కార్యక్రమాలకు ఎళ్లవేళలా సహకారం అందిస్తామన్నారు. సామాజిక బాధ్యతతో సాక్షి చేపట్టిన బృహత్తర కార్యక్రమాన్ని అభినందించారు. స్థానిక కౌన్సిలర్ జాగీరు శైలు మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో పిల్లలు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా.. తల్లిదండ్రులు డ్యాన్స్ శిక్షణకు పంపించాలని కోరారు. డ్యాన్స్‌తో శారీరక శ్రమ కలిగి పిల్లల్లో చురుకుదనం పెరుగుతుందన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని కోరారు. అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, పాఠశాల కరెస్పాండెంట్ రాజ్‌కుమార్, సాక్షి రాజన్నసిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి వూరడి మల్లికార్జున్, డ్యాన్స్ మాస్టర్ పొందుర్తి ధర్మేందర్ పాల్గొన్నారు.



డ్యాన్స్ నేర్పుతున్న మాస్టార్

చదువుతోనే సమాజాభివృద్ధి

- ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి
- ఈ కుగ్రామం నుంచే కలెక్టర్‌నయ్యా
- రాష్ట్రపతి అవార్డు తెచ్చుకునేలా కష్టపడి పనిచేయాలి
- హాజరైన బహుభాషా కోవిదులు నలిమెల భాస్కర్
- నారాయణపూర్‌లో చదువుల పండుగ వారోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న రమణాచారి



పాల్గొన్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చదువుతోనే సమాజం అభివృద్ధి సాధిస్తుందని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. ఫుల్‌బ్రైట్ గ్లోబల్ టీచర్ గ్రాంట్ ప్రాజెక్ట్‌లో భాగంగా సోమవారం ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో ‘చదువుల పండుగ’ వారోత్సవాలను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా రమణాచారి, బహుభాషావేత్త నలిమెల భాస్కర్ హాజరయ్యారు. వారం రోజుల పాటు జరిగే వారోత్సవాలను ముఖ్య అతిథులు ప్రారంభించారు. కేవీ రమణాచారి మాట్లాడుతూ కలెక్టర్, ఎస్పీ, డాక్టర్.. ఏ రంగంలోనైన రాణించాలనుకుంటే ఇప్పటి నుంచే లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలన్నారు. గ్రామంలో ఆధునిక గ్రంథాలయం ఏర్పాటు చేస్తానని, యువత చదువుకొని ఉద్యోగాల కోసం పోటీ పడాలని సూచించారు. ఈ కుగ్రామం నుంచే తాను కష్టపడి చదివి కలెక్టర్‌నయ్యానని.. ఇదే స్ఫూర్తితో ఈతరం యువత చదువుపై దృష్టి సారించాలని మార్గదర్శనం చేశారు. అన్నింటికీ చదువు ఒక్కటే పరిష్కారమని సూచించారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి ఏటా పదో తరగతిలో 70 శాతం మార్కులు సాధించిన 10 మంది వరకు విద్యార్థులకు రూ.10 వేలు, రూ.7,500, రూ.5వేల చొప్పున ప్రోత్సాహకం అందిస్తానని ప్రకటించారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్తులు, సర్పంచ్ కలిసి కష్టపడి అభివృద్ధికి పాటుపడుతూ రాష్ట్రపతి అవార్డు తెచ్చుకునేలా పనిచేయాలని హితోపదేశం చేశారు.

ఐఏఎస్ కావాలనుకునే వారికి అండగా ఉంటా

ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుందని.. కష్టపడి చదివితే ఏదైన సాధించవచ్చని రమణాచారి అన్నారు. పేదరికం చదువుకు అడ్డుకారాదని.. ఐఏఎస్ కావాలనుకునే గ్రామ యువతకు ఆర్థికంతోపాటు అన్ని విధాలా అండగా ఉంటానన్నారు. గొప్ప వాళ్లు అందరూ కష్టాలు అనుభవించిన వారేనని.. తాను సైతం ఆర్థికంగా పేద కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినేనని పేర్కొన్నారు. కష్టపడి చదివి ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో యూనివర్సిటీ మొదటి ర్యాంక్ సాధించిన విషయాన్ని గుర్తు చేస్తూ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ఒక కలెక్టర్‌గా ఉండడం వల్లే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో టీటీడీ ఈవోగా పనిచేసే అదృష్టం దక్కిందన్నారు. ఎన్టీ రామారావు వద్ద పనిచేసిన కాలంలో మొట్టమొదటిసారిగా నాటకరంగానికి నంది అవార్డులను ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. అనేక మంది ముఖ్యమంత్రుల వద్ద పనిచేసిన అనుభవాలు ఉన్నాయని, ఐఏఎస్ అధికారిగా తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. చదువుకుంటే సమాజానికి ఎలాంటి మంచి పనులు చేయవచ్చో చిన్నారులకు వివరిస్తూ స్ఫూర్తి నింపారు.

ఊరి చరిత్రను చదవండి : నలిమెల భాస్కర్

యువత, విద్యార్థులు ముందుగా ఊరి చరిత్రను చదివి, గొప్ప వారి జీవితాల గురించి తెలుసుకోవాలని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్ సూచించారు. గ్రామంలో అటెండర్ నుంచి ఐఏఎస్ వరకు చదువుకున్న వారు ఉన్నారని, వారినే మార్గదర్శకులుగా ఎంచుకోవాలని సూచించారు. మహావ్యక్తుల జీవితచరిత్రలను స్ఫూర్తిగా తీసుకుని గొప్ప వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. చదువు ఒక్కటే విలువలతో కూడిన జీవితాన్ని అందిస్తుందని, అందరూ చదువుకొని అత్యున్నత స్థాయిల్లో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమ నిర్వాహకులు ఉపాధ్యాయుడు లింగాల రాజును అతిథులు ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ సాహిత్య అకాడమీలో పనిచేస్తున్న శ్రీనివాసాచారి, మనోహరాచారి, జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, సర్పంచ్ నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీ అపెరా సుల్తానా, ప్రధానోపాధ్యాయుడు కృష్ణహరి, పెద్ద ఎత్తున గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- పంటలను కలెక్టర్ పరిశీలించాలి
- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

చందుర్తి/రుద్రంగి(వేములవాడ): వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. మండలంలోని నర్సింగాపూర్, అశిరెడ్డిపల్లె, రుద్రంగి గ్రామాల్లో వడగండ్ల వానకు దెబ్బతిన వరిపంటను సోమవారం పరిశీలించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కలెక్టర్ పర్యటించి, పంటనష్టాన్ని మండలాలవారీగా నివేదిక ఇవ్వాలని కోరారు. పక్క రాష్ట్రాల రైతులకు కోట్లాది రూపాయలు సహాయం చేసిన సీఎం రాష్ట్ర రైతులకు మొండిచేయి చూపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో జాప్యం ఎందుకు అని నిలదీశారు. కొనుగోలు కేంద్రాలు చెరువులను తలపిస్తున్నాయన్నారు. ఎకరాకు రూ.25వేల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. చందుర్తి జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు బానాల రవీందర్‌రెడ్డి, నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ బొజ్జ మల్లేశం, చందుర్తి సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు అంచా రాంరెడ్డి, సర్పంచ్ అంచా సుమ, సింగిల్‌విండో డైరెక్టర్ అంచా శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.



రాలిన పంటను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్రీడలతో మానసికోల్లాసం



పోటీల్లో పాల్గొన్న పోలీసులు, యువకులు

సిరిసిల్లక్రైం : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని పోలీసు అధికారులు పేర్కొన్నారు. పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా సోమవారం సిరిసిల్ల బైపాస్ రోడ్డులో రన్నింగ్, సైక్లింగ్, క్యారం, టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా జిల్లా యువకులతో క్రీడల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని అధికారులు తెలిపారు. ఆర్‌ఐ రజనీకాంత్, కుమారస్వామి, యాదగిరి, సీఐ అనిల్, ట్రాఫిక్ ఎస్సై రాజు పాల్గొన్నారు.



కిక్కిరిసిన రాజన్న ఆలయం

వేములవాడ: రాజన్నను సోమవారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణ భక్తులతో రద్దీగా మారింది. అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు.

క్లుప్తంగా

మైనర్‌కు ట్రాక్టర్ ఇచ్చిన వ్యక్తిపై కేసు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం అంకుషాపూర్‌లో ఆదివారం ట్రాక్టర్ కిందపడి ఏడేళ్ల బాలిక మృతిచెందిన ఘటనలో ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.లక్ష్మారెడ్డి తెలిపారు. మైనర్ బాలుడికి ట్రాక్టర్ ఇచ్చి నిర్లక్ష్యంగా వ్యవహరించి ఒక చిన్నారి మృతికి కారణమైన ట్రాక్టర్ యజమాని కూర్మ రాజయ్యపై మృతిచెందిన బాలిక తండ్రి ముద్దం సురేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులు ఏ–1గా జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా కానిస్టేబుల్ మృతి


వేదశ్రీ (ఫైల్)

సిరిసిల్ల క్రైం: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళా కానిస్టేబుల్ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా పరిధిలోని మల్యాల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వేదశ్రీ సోమవారం విధులకు వెళ్తుండగా బైక్ అదుపుతప్పడంతో కిందపడింది. స్థానికులు జగిత్యాల ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు.

'ఉపాధి కల్పించాలి'

సిరిసిల్ల అర్బన్: రోడ్డు ప్రమాదంలో భర్త, కొడుకును కోల్పోయిన తనకు ఉపాధి కల్పించాలని వేములవాడ అర్బన్ మండలం కొడుముంజకు చెందిన బూర రజిత తన కూతురితో కలిసి ప్రజావాణిలో కలెక్టర్ అనురాగ్ జయంతిని వేడుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమకు ఇద్దరు కుమారుడు కార్తీకేయ, కూతురు ఉందని, 2018లో రోడ్డు ప్రమాదంలో భర్త శ్రీకాంత్, కొడుకు కార్తీకేయ చనిపోయినట్లు తెలిపారు. బీడీలు చుడుతూ తన కూతుర్ని చదివిస్తున్నానని, రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించాలని కోరింది. ముంపు గ్రామాలకు ప్రభుత్వం అందించే రూ. 2లక్షల పరిహారం అందించాలని కలెక్టర్‌ను వేడుకుంది. స్పందించిన కలెక్టర్ పాఠశాల యాజమాన్యంతో మాట్లాడాలని అధికారికి సూచించారు. ఉపాధి కల్పిస్తామని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులపై కక్షసాధింపు చర్యలు

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి

తంగళ్లపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో నిరవధిక సమ్మె చేస్తున్న జేపీఎస్‌ల శిబిరాన్ని బీజేపీ నాయకులు సందర్శించి సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ జేపీఎస్, ఓపీఎస్‌లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు సురువు వెంకట్, జనరల్ సెక్రటరీ సందవేని రాజు యాదవ్, యువమోర్చా అధ్యక్షుడు ఆంజనేయులు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు వంశీ పాల్గొన్నారు.

వివాదాస్పదంగా చెట్ల నరికివేత

బోయినపల్లి (చొప్పదండి): మండలంలోని తడగొండ గ్రామ బస్టాండ్ పరిసరాల్లో చెట్ల నరికివేత వ్యవహారం వివాదస్పదంగా మారింది. బస్టాండ్ పరిసరాల్లో ఓ రియల్టర్ భూమి కొనుగోలు చేసినట్లు సమాచారం. ఆస్థలంలో చింత చెట్లు భారీగా పెరిగాయి. అనుమతి తీసుకున్నానని చెట్లు నరికివేస్తున్నాడు. కాగా ఆ పరిసరాల్లో తమకు స్థలం ఉందని, తమస్థలంలో చెట్ల నరికివేతకు అనుమతి ఎలా ఇస్తారని గ్రామానికి చెందిన లక్ష్మి ఉమ్మడి జిల్లా డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేసింది. సదరు రియల్టర్ ఓ సర్వేనెంబర్‌లో చెట్ల నరికివేతకు అనుమతి తీసుకొని మరో సర్వేనంబర్‌లో చెట్లు నరికివేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయమై వేములవాడ ఎఫ్‌ఎస్‌వో అఫ్జల్ హుస్సేన్‌ను సోమవారం వివరణ కోరగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు.

మళ్లీ నిర్వాసితుల పోరుబాట


- నిరాహార దీక్షకు సిద్ధం
- సీఎం హామీపై ఏళ్లుగా ఆశలు
- 18 ఏళ్లు నిండిన ప్యాకేజీకి డిమాండ్
- సమస్యలు పరిష్కరించాలని విన్నపం

వేములవాడఅర్బన్: మధ్య మానేరు నిర్వాసితులు మళ్లీ పోరుబాటకు సిద్ధమయ్యారు. ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు.. సీఎం హామీకి మోక్షం లభించకపోవడం.. 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీపై స్పష్టత రాకపోవడం.. పునరావాసకాలనీల్లో సమస్యలు పరిష్కరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్ల సాధనకు నిరవధిక నిరాహార దీక్షకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములను తీసుకొని.. గ్రామాలను ఖాళీ చేయించిన ప్రభుత్వం తర్వాత తమను పట్టించుకోవడం లేదని ఆగ్రహం నిర్వాసితుల్లో ఉంది. ఉపాధి కల్పిస్తామన్న అధికారులు ఆమేరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై కినుక వహించారు.

12 గ్రామాలు..11,861 కుటుంబాలు

రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ–చీర్లవంచ గ్రామాల మధ్య జలయజ్ఞంలో భాగంగా 2006లో మధ్యమానేరు ప్రాజెక్ట్‌ను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. మిడ్‌మానేరులో కొదురుపాక, వర్ధవెల్లి, నీలోజిపల్లి, శాభాష్‌పల్లి, చింతాల్‌ఠాణా, చీర్లవంచ, గుర్రంవాణిపల్లి, కొడుముంజ, అనుపురం, సంకెపల్లి, రుద్రవరం, ఆరెపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఈ ప్రాజెక్ట్ 2008 గెజిట్ ప్రకారం 11,861 కుటుంబాలు ముంపునకు గురయ్యాయి. అందులో సుమారుగా 8 వేల ఇళ్లకు నష్టపరిహారం అందించారు. మిగిలిన ఇళ్లు, భూములకు నష్టపరిహారం అందించాలని కోరుతూ నిర్వాసితులు అప్పటి నుంచి ధర్నాలు, పాదయాత్రలు, రాస్తారోకోలు చేస్తున్నారు. అయినా వారి సమస్యలు నెరవేరడం లేదు. దీంతో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు రుద్రవరం–సంకెపల్లి గ్రామాల మధ్య మిడ్‌మానేరు ముంపు గ్రామాల ఐక్యవేదిక, అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరవధిక నిరహారదీక్షకు సిద్ధమవుతున్నారు.

గతం నుంచి ధర్నాలు


కొడుముంజ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ

- ముంపు గ్రామాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొదురుపాకలో భారీ బహిరంగ సభ నిర్వహించారు.
- రుద్రవరంలో నిర్వాసితుల ఆమరణ నిరహార దీక్ష, రోడ్డుపై వంటావార్పు చేపట్టారు.
- బోయినపల్లి మండలం నీలోజిపల్లి నుంచి కలెక్టరేట్ వరకు 10 వేల మందితో పాదయాత్ర చేపట్టారు.
- వేములవాడ నందికమాన్ వద్ద 10 వేల మందితో మహాధర్నాకు వెళ్తుండగా ఎక్కడికక్కడే పోలీసులు అరెస్ట్ చేశారు. అయినప్పటికీ నందికమాన్ వరకు నిర్వాసితులు తరలివెళ్లారు.
- ఆ ధర్నాతో స్పందించిన స్పందించి ఆర్‌అండ్ ఆర్ కాలనీలకు స్పెషల్ అధికారులను నియమించింది.
- గ్రామసభలు ఏర్పాటు చేసి నిర్వాసితుల నుంచి ప్రత్యేకాధికారులు దరఖాస్తులు స్వీకరించారు.
- ఆ దరఖాస్తుల స్వీకరణపై ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు.

నిర్వాసితుల డిమాండ్లు ఇవీ..

- 2015లో సీఎం కేసీఆర్ వేములవాడకు వచ్చి పట్టా ఇచ్చిన ప్రతీ కుటుంబానికి రూ.5.04 లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీని నేరవేర్చాలి.
- నేటికి 18 ఏళ్లు నిండిన వారికి రూ.5 లక్షలు, ఇళ్ల పట్టాలు అందించాలి.
- ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పరిహారం, భూముల పరిహారం అందించాలి.
- నిర్వాసితులకు ఉపాధిఅవకాశాలు కల్పించాలి.
- పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.
- అర్ధంతరంగా నిలిచిన ఆలయ నిర్మాణాలను పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలి.
- ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోని పూర్తి స్థాయి సమస్యలను వెంటనే పరిష్కరించాలి.


ఇటీవల నిర్వహించిన అఖిలపక్షం సమావేశం

అఖిలపక్షం నాయకుల మద్దతు

- వేములవాడ మండలం రుద్రవరం, సంకెపల్లి గ్రామాల మధ్య ఐక్యవేదిక, అఖిలపక్షం ఆధ్వర్యంలో మే 8 నుంచి 10 వరకు నిర్వహించే నిరవధిక నిరాహారదీక్షకు అఖిలపక్షం నాయకులు మద్దతు ఇస్తున్నారు. ఇప్పటికే జేఏసీ నాయకులు డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణను కలిసి మద్దతు కోరారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాడుతాం



మిడ్‌మానేరు ముంపు గ్రామాల్లోని నిర్వాసితుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించే వరకు పోరాడుతాం. నిర్వాసితులకు మిగిలిన పట్టాలు, ప్యాకేజీ, ఇళ్లు, భూముల పరిహారం అందించాలి. సీఎం ఇచ్చిన హామీ వెంటనే నెరవేర్చాలి. అప్పటి వరకు పోరాటం చేస్తానే ఉంటాం.

– కూస రవీందర్, మిడ్‌మానేరు ఐక్యవేదిక అధ్యక్షుడు

అంజనీనగర్‌లో నీటి తిప్పలు


ట్యాంకర్ల వద్ద నీరు నింపుకుంటున్న కాలనీవాసులు

వేములవాడ: వేములవాడలోని అంజనీనగర్‌లో నీటితిప్పలు తీవ్రమయ్యాయి. నల్లా నీరు వారం రోజులుగా రావడం లేదని కౌన్సిలర్ అన్నారం ఉమారాణి కమిషనర్, ఏఈల దృష్టికి తీసుకెళ్లారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో సోమవారం ట్యాంకర్ల ద్వారా వార్డులోని ఇంటింటికీ నీటి సరఫరా చేయించారు. మిషన్ భగీరథ నీరు తమ వార్డుకు వచ్చేలా చొరవ తీసుకోకుంటే మున్సిపల్ ఆఫీస్ ఎదుట కాలనీవాసులతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఫోన్ అప్పగింత


బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న సీఐ

కోనరావుపేట: ఓ వ్యక్తి పోగొట్టుకున్న ఫోన్‌ను సీఈఐఆర్ ద్వారా పోలీసులు గుర్తించి బాధితుడికి అందించారు. సిరిసిల్లకు చెందిన ఓ వ్యక్తి తన ఫోన్ పోయిందని కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్‌తో గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌లో ఉన్నట్లు గుర్తించారు. సోమవారం ఠాణాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా బాధితుడికి ఫోన్ అప్పగించారు. కానిస్టేబుళ్లు సత్యం, నాగరాజును సీఐ అభినందించారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా

- పోలీస్ స్పోర్ట్స్ మీట్
- క్రీడాస్ఫూర్తిని చాటిన పోలీసులు


క్రీడాపోటీల్లో పాల్గొన్న పోలీసులు

సిరిసిల్లఅర్బన్: దొంగతనాలు.. హత్యలు.. లైంగిక దాడులు.. కేసులు.. విచారణలు..వీఐపీ బందోబస్తు.. వీటితోనే బిజీగా గడిపే జిల్లా పోలీసులు వాలీబాల్.. రన్నింగ్.. టేబుల్‌టెన్నిస్.. క్యారమ్ ఆటలతో ఉత్సాహంగా గడుపుతున్నారు. పోలీస్ స్పోర్ట్స్‌మీట్‌లో భాగంగా శనివారం ఇండోర్‌గేమ్స్ ఆడారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని మినీ స్టేడియంలో శుక్రవారం నుంచి పోలీస్ క్రీడలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మహిళా ఉద్యోగినులు మరింత ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొంటున్నారు. మొదటి రోజు ఎస్పీ అఖిల్‌మహాజన్ క్రీడాపోటీలను ప్రారంభించారు. మంగళవారం పోలీస్ క్రీడలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులను 'సాక్షి' పలకరించింది. ఆనందం వారి మాటల్లోనే..

ఆనందంగా ఉంది



జిల్లాలో తొలిసారి నిర్వహిస్తున్న పోలీస్ క్రీడా పోటీలలో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఎల్లప్పుడూ విధి నిర్వహణలో ఉండే మాకు ఈ పోటీలు నూతన ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఇలాంటి పోటీలు ఒత్తిడిని దూరం చేస్తాయి.

– అనిల్‌కుమార్, సిరిసిల్ల టౌన్ సీఐ

పండుగలా మారింది



రెండు రోజులుగా స్పోర్ట్స్ మీట్‌తో పండుగ వాతావరణం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా పోలీసులు అందరూ ఒకే వేదికపై కలుసుకోవడం అరుదైన అవకాశం. వంద మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానంలో నిలిచాను.

– శ్రీకాంత్, ఎస్సై

క్రీడలతో మానసిక ప్రశాంతత



మానసిక ప్రశాంతతకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయి. ఎప్పుడో చిన్నప్పుడు ఆడినట్లు గుర్తు. మళ్లీ ఇప్పుడు ఇలా తోటి సిబ్బందితో కలిసి ఆడడం చాలా సంతోషంగా ఉంది.

– రాజు, ఎస్సై

ఒత్తిడి నుంచి ఉపశమనం



క్రీడలు మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయి. ఈ స్పోర్ట్స్‌మీట్‌తో క్రీడాకారులకు గుర్తింపు లభిస్తుంది. పనిలో సతమతమయ్యే మాకు ఈ పోటీలు ఉల్లాసాన్ని కలిగించాయి.

– ప్రియాంక ఏఆర్ కానిస్టేబుల్, సిరిసిల్ల

జనశక్తి 'రాజన్న'పై నిఘా

- రాజన్నను కలిసిన వారి వివరాల సేకరణ
- కోర్టు ఆదేశాలతో జిల్లాలో నివాసం
- కదలికలపై ఎప్పటికప్పుడు పోలీసు నివేదికలు


కూర రాజన్న

సిరిసిల్లక్రైం : ఏళ్లుగా వివిధ కేసుల్లో జైలు జీవితం గడిపి ఇటీవలే కోర్టు ఆదేశాలతో బయటకు వచ్చిన జనశక్తి అగ్రనేత కూర రాజన్న కదలికలపై పోలీసుల నిఘా వేములవాడలో ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ విషయంపై పోలీసు అధికారులను అడిగితే కూర రాజన్న స్థానికంగా ఉన్నమాట వాస్తవేమని, ఆయన కదిలికలతో రోజువారీగా వచ్చి వెళ్తున్న వారి వివరాలు సేకరించే పనిలో ఉన్నట్లు చెబుతున్నారు. నాలుగున్నర దశాబ్దాల పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో జనశక్తి పార్టీ నిర్మాణంలో రాజన్న కీలక పాత్ర పోషించారు. వేములవాడకు చెందిన ఆయన విప్లవోద్యమంలో పనిచేస్తూ ఉత్తరప్రదేశ్‌లోని బారా బంకిలో అరెస్ట్ అయ్యారు. కోనరావుపేట మండలం సుద్దాల మాజీ సర్పంచ్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు ప్రభాకర్ రావు అలియాస్ వేణుగోపాలరావు 2013లో జరిగిన హత్య కేసులో కూర రాజన్నను గతేడాది ఆగస్టులో పోలీసులు అరెస్ట్ చేయగా మొన్నటి వరకు జైలు జీవితం గడిపారు. పలుసార్లు జైలుకు వెళ్లొచ్చిన రాజన్న కోర్టుకు హాజరుకాకపోవడంతో 2022లో నాన్‌బెయిల్ వారెంట్‌పై హైదరాబాద్‌లోని కొకూరులో పోలీసులు మరోసారి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొన్ని నిబంధనలతో కూడిన బెయిల్‌పై ఇటీవల రాజన్న బయటకు వచ్చారు. జిల్లా దాటి వెళ్లరాదన్న నిబంధనతో వేములవాడలోని మున్నూరు కాపు నిత్యన్నదాన సత్రంలో నివాసముంటున్నారు.

ఉన్నతాధికారులకు సమాచారం..

బీఆర్‌ఎస్ ప్లీనరీ సమావేశం జరిగిన అనంతరం సిరిసిల్లలో ప్రజాసంఘాల నాయకులు సమావేశం నిర్వహించడం ప్రత్యేకత సంతరించుకుంది. ప్రజాసంఘాల నాయకులు నిర్వహించిన సమావేశం ఉద్దేశమేమిటన్నదానిపై పోలీసు శాఖలో ప్రత్యేక విభాగాలు వివరాలు సేకరించినట్లు సమాచారం. వేములవాడలో నివాసముంటున్న కూర రాజన్న వద్దకు వచ్చి వెళ్తున్న వారి వివరాలను సేకరించే పనిలో పలువురు ఉన్నారు. పోలీసులు ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు సమాచారం.

పోరాటాలతోనే హక్కులు సాధ్యం


సిరిసిల్ల డిపో ముందు మేడే వేడుకల్లో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు


బీఆర్‌ఎస్‌కేవీ ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్న నాయకులు

- మే డే వేడుకల్లో కార్మిక నాయకులు
- సిరిసిల్లలో ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం

సిరిసిల్ల టౌన్: పెట్టుబడి వ్యవస్థపై పోరాడితేనే కార్మికుల హక్కులు సాధిస్తామని వక్తలు పేర్కొన్నారు. సోమవారం సిరిసిల్లలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్ నేతృత్వంలో మే డే వేడుకలు నిర్వహించారు. వందలాది సంఖ్యలో కార్మికులు పాల్గొనగా పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జరిగిన మే డే వేడుకల్లో చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ వెల్దండి సమ్మయ్య, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. బీవైనగర్ సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, నాయకులు ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. సిరిసిల్ల కార్మిక భవనం సీపీఐ కార్యాలయంపై రాష్ట్ర నాయకులు మల్లేశం, జిల్లా కార్యదర్శి గుంటి వేణు మేడే జెండాను ఎగురవేశారు. పెద్దబజార్‌లో హిందూ సాంస్కృతిక సమితి, సిరిసిల్ల డైయింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా జరిపారు. ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జాతీయ అధ్యక్షుడు గుర్రం విజయ్ జెండా ఎగురవేశారు. ప్రభుత్వ కళాశాల మైదానం నుంచి కార్మికులు ర్యాలీ తీశారు. జిల్లా నాయకులు కార్మికులు పాల్గొన్నారు. సెస్ ఆఫీస్ ఎదుట 1104 యూనియన్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి దేవయ్య, సెస్ ఎండీ రామకృష్ణ, డీఈఈ ఈశ్వర్‌ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు. మున్సి పల్ పక్క సందిలోని లేబర్ అడ్డావద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అక్కనపెల్లి భాస్కర్ ఆధ్వర్యంలో మే డే వేడుకలు జరిపారు. ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు వేడుకలు నిర్వహించగా నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ సంఘటిత, అసంఘటి త కార్మికుల సంఘం, జిల్లా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో రిటైర్డ్ లేబర్ ఆఫీసర్ బలరాం, శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిలుముల జయవర్ధన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు.

పేరుకే ప్రజావాణి

- సమస్యల పరిష్కారం అంతంతే...
- పలుసార్లు అర్జీ పెట్టుకుంటున్న బాధితులు



రుద్రంగి మండలం వీరుని తండా గ్రామ పంచాయతీ పరిధిలోని లావుద్య తండాకు చెందిన లావుడ్య నరహరి తమ తండాకు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజావాణిలో ఇప్పటికీ ఎనిమిది సార్లు ఫిర్యాదు చేశాడు. చిన్న వర్షానికే రోడ్డు చిత్తడిగా మారి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు, సమస్య పరిష్కరించాలని ఎన్నిసార్లు ప్రజావాణికి వచ్చినా పరిష్కారం కాలేదని వాపోయాడు.




ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలోనే రాత్రి పగలు ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారని, ప్రభుత్వం సాయినగర్‌లో ఇసుక రీచ్ కేటాయించగా, అనుమతులు లేకుండా విద్యానగర్, ప్రేమ్‌నగర్, గంగమ్మ గుడి తదితర ప్రాంతాల నుంచి అక్రమ రవాణా చేస్తున్నారని కలెక్టర్‌కు సిరిసిల్ల ట్రాక్టర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడడమే కాకుండా ఉపాధి కోల్పోతామని, ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సిరిసిల్ల అర్బన్: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ జిల్లాస్థాయి ఉన్నతాధికారులను ఆదేశించినా పూర్తిస్థాయిలో పరిష్కారానికి నోచుకోవడం లేదు. పలుమార్లు బాధితులు ప్రజావాణికి వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. తమ సమస్య పరిష్కరించాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేదని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రజావాణి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజావాణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి పలు శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో బాధితుల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి తక్షణమే బాధితులకు న్యాయం చేయాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి కేవలం 10 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. జిల్లా అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, ఆర్డీవోలు శ్రీనివాస్ రావు, పవన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందించండి



మాది సిరిసిల్ల. నాకు వైకల్యం ఉంది. అయినా ప్రైవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నా. ట్రై సైకిల్ కోసం పలుసార్లు దరఖాస్తు చేసుకున్నా రావడం లేదు. అధికారులు స్పందించి ట్రై సైకిల్ ఇప్పించండి.

– వాసాల శ్రీనివాస్, సిరిసిల్ల

విధుల నుంచి తొలగించారు



మాది వేములవాడ. మానాన్న నామాల శ్రీనివాస్, మామిడిపల్లి సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తూ అనారోగ్యంతో మృతిచెందాడు. దేవాదాయ ధర్మాదాయ శాఖ వారికి ఉపాధి కల్పించాలని కోరగా వేద పాఠశాలలో నన్ను కేర్ టేకర్‌గా నియమించారు. 2021 నుంచి ఏప్రిల్ 28, 2023 వరకు వేద పాఠశాలలో పనిచేశా. కానీ ఇప్పుడు బ్రాహ్మణ కులం వారు మాత్రమే పనిచేయాలని నన్ను అకారణంగా తొలగించారు. సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి.

– నామాల ప్రశాంత్, వేములవాడ

అ'పూర్వ' సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గంభీరావుపేట (సిరిసిల్ల): మండలంలోని కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1992–93 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం పాఠశాలలో అ'పూర్వ' సమ్మేళనం నిర్వహించారు. నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందోత్సాహాలతో గడిపారు. ఒకరినొకరు పలకరించుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 30 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఆడిపాడారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.